క్లుప్తంగా

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



కాకరాపల్లిలో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

మునగపాక: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని కాకరాపల్లి, ఒంపోలు పేట, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఆక్రమణలను శుక్రవారం తొలగించే చర్యలను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా ఆక్రమణలు ఉన్నట్లు తమ దృష్టికి తీసుకువస్తే, వాటిని తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ పడాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రచ్చబండపై రేకుల షెడ్డు ఏర్పాటు



రచ్చబండపై రేకుల షెడ్డు ఏర్పాటు చేసిన దృశ్యం

ఎస్.రాయవరం: గ్రామస్తులకు ప్రయోజనం చేకూరే పని చేసేందుకు వెనుకాడనని తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపురం శివారు గోకులపాడు గ్రామంలో రచ్చబండపై నీడ కోసం షెడ్డు ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు తరచూ ఇక్కడ సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ ఉంటారు. ఆ సమయంలో ఎండా వానకు ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు పంచాయతీ నిధులు రూ.లక్ష వరకు కేటాయించి రచ్చబండపై రేకుల షెడ్డు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ మేరకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

శేష జీవితం ఆనందంగా గడపాలి



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుని సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల శేష జీవితం ఆనందంగా గడపాలని ఏపీటీఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు ఆకాంక్షించారు. పెదఉప్పలం ఉన్నత పాఠశాలలో పని చేసి పదవీ విరమణ పొందిన ఇ. కుమార్‌స్వామిని ఘనంగా సత్కరించారు. ధర్మారావు మాట్లాడుతూ కుమార్‌స్వామి తన సర్వీస్‌లో ఒక్క మెడికల్ లీవ్ పెట్టకుండా విధులు పూర్తి చేశారని కొనియాడారు. అంకిత భావంతో పని చేసి విశిష్ట సేవలందించిన ఆయన శేష జీవితంలో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సకురు సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాజు, కాదంబరి శ్రీనివాసరావు, కాశీలు, సాయి తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

కశింకోట: మండలంలోని జమాదులపాలెం గ్రామ శివారులో మద్యం విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఈ మేరకు 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ కె.ఎస్. గణేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా నిందితుడు పడాల రామును అరెస్టు చేశామన్నారు.

ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం



వెనుక భాగం దెబ్బతిన్న ఆర్టీసీ డాల్ఫిన్ బస్సు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం కూడలిలో ఆర్టీసీ డాల్ఫిన్ ఎక్స్‌ప్రెస్ బస్సుకు శుక్రవారం పెద్ద ప్రమాదం తప్పింది. జాతీయ రహదారిపై విజయవాడ నుంచి విశాఖ వెళుతున్న బస్సును వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో వెనుక భాగం, అద్దాలు దెబ్బతిన్నాయి. అయితే అదృష్టవశాత్తు ప్రయాణికులకు ఎటువంటి హాని జరగలేదు. ప్రయాణికులను వేరో బస్సులో ఎక్కించి గమ్యాలకు తరలించారు.

వాలీబాల్ విజేత ఆర్యభట్ట కళాశాల

సబ్బవరం: విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన స్టేట్ లెవల్ వాలీబాల్ పోటీల్లో స్థానిక ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని కళాశాల సెక్రటరీ సీహెచ్ మహందత్త తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా జట్టుపై గెలిచిందన్నారు.

విజ్ఞానానికి తాళం

తెరుచుకోని రాంబిల్లి గ్రంథాలయం
పేరుకే ఇన్‌చార్జి గ్రంథపాలకుడు
వారంలో ఒక రోజు రావడం కష్టమే!
పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇబ్బందులు
మగ్గిపోతున్న విలువైన పుస్తక సామగ్రి



గతంలో గ్రంథాలయానికి వినియోగించిన పాత తుఫాన్ భవనం

రాంబిల్లి (యలమంచిలి): గ్రంథాలయాలు విజ్ఞానానికి చిరునామాలు.. వాటిని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే కూటమి ప్రజాప్రతినిధులు వాటి ఆలనాపాలనా పట్టించుకోవడం లేదు. రిటైర్డ్ అవుతున్న సిబ్బంది స్థానంలో కొత్త వారిని నియమించకపోవడంతో ఇన్‌చార్జులతో నెట్టుకొస్తున్నారు. దాంతో రాంబిల్లి గ్రంథాలయం మూతపడే పరిస్థితికి వచ్చింది.

రాంబిల్లి మండలంలో దిమిలి, రాంబిల్లి గ్రంథాలయాలు ఉన్నాయి. వాటిలో మండల కేంద్రంలో గ్రంథాలయానికి సొంత భవనం కరువైంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాంబిల్లిలో గ్రంథాలయం నిర్వహణ ఒకప్పుడు పాత తుఫాన్ శిథిల భవనంలో జరిగేది. ఆ భవనం శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితికి చేరుకోవడంతో పాఠకులు గ్రంథాలయానికి రావడానికి ఆసక్తి చూపేవారు కాదు. అప్పుడు రాంబిల్లి పంచాయతీ కార్యాలయం పక్కన చాలీచాలని భవనంలోకి మార్చారు. ఆ భవనంలో ఒక గదిని మాత్రమే గ్రంథాలయానికి ఇవ్వగా, మరొక గదిని వ్యవసాయ శాఖ కార్యాలయానికి కేటాయించారు. గ్రంథాలయంలో పుస్తకాలు పెట్టడానికి తప్పా పాఠకులు చదువుకోవడానికి మరొక గది లేదు. కనీస మౌలిక వసతులు లేవు.

మౌలిక వసతులు కరువు...

సరిపడా ఫర్నిచర్, మరుగుదొడ్లు, ఫ్యాన్లు లేక విద్యార్థులు, పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు లేకపోవడం తగినంత వెలుతురు ఉండటం లేదు. గ్రంథాలయం శుభ్రపరిచే అటెండర్ లేక ఎక్కడ గొంగలి అక్కడే అన్నట్లుగా అపరిశుభ్రంగా మారింది. పంచాయతీలకు ప్రజలు గ్రంథాలయ పన్ను చెల్లిస్తున్నా అభివృద్ధి మాత్రం చెందడం లేదు. రాంబిల్లి మండలంలో ఎస్ఈజెడ్ పరిశ్రమలు చాలా వచ్చాయి. పరిశ్రమల ద్వారా వచ్చే సీఎస్ఆర్ ఫండ్స్‌తో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలని పాఠకులు కోరుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో గ్రంథాలయాధికారిని నియమించి కొత్త భవనం నిర్మించాలని, లేని పక్షంలో వేరొక భవనం కేటాయించాలని కోరుతున్నారు.

ఇన్‌చార్జులతోనే సరి...

ఇక్కడ పనిచేస్తున్న గ్రంథాలయాధికారి ఏడాదిన్నర క్రితం పదవీ విరమణ చేసిన తర్వాత మునగపాక గ్రంథాలయాధికారిని ఇన్‌చార్జిగా వేయగా రెండు నెలలు చేశారు. తాళ్లపాలెం గ్రంథాలయాధికారి నియమించగా, మరొక పోస్టింగ్‌కు వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి అధికారితోనే నెట్టుకొస్తున్నారు. పరవాడ గ్రంథాలయాధికారిని ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్నతాధికారులు నియమించారు. ఆయన వారానికొకసారి ఇక్కడకు వచ్చి తెరుస్తున్నారు. పేరుకే గ్రంథాలయం ఉన్నా నిత్యం తెరుచుకోవడం లేదని పాఠకులు ఆరోపిస్తున్నారు.



రాంబిల్లిలో గ్రంథాలయ భవనం

పాఠకులు ఇబ్బంది పడుతున్నారు



రాంబిల్లి గ్రంథాలయం తెరవకపోవడం వల్ల పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ గ్రంథాలయం పేరుకే ఉంది. ఎప్పుడూ తాళం వేసి ఉంటోంది. వార్తాపత్రికలు చదవటానికి గ్రంథాలయం తెరవడం లేదు. దీనివల్ల విలువైన పుస్తకాలు పాడైపోతున్నాయి. గ్రంథాలయం తెరవాలి. వార్తాపత్రికలు అందుబాటులో ఉండేటట్లు చూడాలి.

– జి.దేముడునాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

విద్యార్థులకు అందని గ్రంథాలయ సేవలు



రాంబిల్లిలో గ్రంథాలయం ఎప్పుడు మూసే ఉంటోంది. గ్రంథాలయానికి వెళ్లి వార్తాపత్రికలు చదువుదామంటే ఎప్పుడూ తెరుచుకోదు. గ్రంథాలయ భవనంలో వసతులు లేవు. సిబ్బంది ఉండరు. గ్రంథాలయం తెరచుకోకపోవడం వల్ల విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులు ఇబ్బందులు గురవుతున్నారు.

సారిపల్లి పైడిరాజు, వెంకటాపురం

రెండు చోట్ల విధుల వల్ల...

నేను పరవాడ గ్రంథాలయాధికారిగా సేవలు అందిస్తున్నాను. రాంబిల్లి గ్రంథాలయానికి ఇన్‌చార్జిగా ఇక్కడ నియమించారు. అందువల్ల వారానికి ఒక్కసారే వస్తున్నాను. సిబ్బంది కొరత వేధిస్తోంది. రాంబిల్లి గ్రంథాలయ భవనంలో వసతులు లేవు. పాఠకులు చదువుకునేందుకు ఉన్న గదులు సరిపోలేదు. గ్రంథాలయంలో పుస్తకాలు పెట్టడానికే చోటు లేదు. ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. సొంత భవనం లేదు.

– లక్ష్మణరావు, ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి, రాంబిల్లి

నేడు మునగపాకలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



మునగపాక గౌరీ పరమేశ్వరుల ఆలయం



గౌరీ పరమేశ్వరులు

మునగపాక: గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని మునగపాకలో శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామస్తుల సహకారంతో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, కోశాధికారి పొలిమేర కృష్ణ తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి గౌరీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశామన్నారు. అదే రోజు రాత్రికి పలు నేలవేషాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి గౌరీ పరమేశ్వరులను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పి.ప్రసాదరావు బందోబస్తు నిర్వహణకు తగు చర్యలు తీసుకుంటున్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్



ఉపాధ్యాయుడు నాగేశ్వరరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

యలమంచిలి రూరల్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం యలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డు జెడ్పీ హైస్కూల్‌లో పదవీ విరమణ చేసిన సైన్స్ అసిస్టెంట్ వనుం నాగేశ్వరరావును ఆయన ఘనంగా సత్కరించారు. తన సర్వీసులో బాగా పనిచేసి నాగేశ్వరరావు అందరి మన్ననలు పొందారన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, అంకిత భావంతో పనిచేస్తే వచ్చే గుర్తింపు జీవితాంతం మధురానుభూతినిస్తుందని ఎంపీపీ బోదెపు గోవింద్ అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి వై అప్పారావు, పలు రాజకీయ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు హాజరై పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు దంపతులను దుశ్శాలువాలు, పూలబొకేలతో సత్కరించారు. శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు.

ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత



ఆలయంలో సామూహిక దీపారాధన చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

యలమంచిలి రూరల్: పట్టణంలోని దిమిలి రోడ్డు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం రాత్రి వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు ఆలయంలో సామూహిక దీపారాధన చేపట్టారు. కుంకుమార్చనలు, భజనలు, ప్రదక్షిణలు చేశారు. అంతకుముందు ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి నగర సంకీర్తన, గణపతి పూజ, వాసవీమాతకు అభిషేకాలు, మహా మంగళహారతి జరిపారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తమ కుటుంబ సభ్యుల పేర్లు, గోత్ర నామాలతో పూజలు చేయించారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

3 నుంచి మూడు రోజుల ఫార్మా ఎక్స్‌పో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు

పరవాడ: జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ఫార్మాసిటీ మాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో మూడు రోజుల పాటు ఫార్మా ల్యాబ్స్ కం ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు తెలిపారు. ఫార్మాసిటీ ఎంఏఎస్ఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మా రంగంలో వ్యాపార సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఈ ఎగ్జిబిషన్ దోహదపడుతుందన్నారు. ఇక్కడ మూడోసారి నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లో అత్యాధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సమాచారాన్ని అందించనున్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది ప్రదర్శనకారులు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. మార్కెట్లో నూతన పోకడలను అవలంబించడం ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా అనుభవాన్ని, సాంకేతిక నైపుణ్యాలను ఎగ్జిబిషన్ హైలెట్ చేస్తుందని చెప్పారు. ఈ ఎగ్జిబిషన్‌తో పరవాడ, అచ్యుతాపురం, పైడిభీమవరం, నక్కపల్లి ప్రాంతాల్లోని ఫార్మాస్యూటికల్స్, తయారీదారులు, అనుబంధ పరిశ్రమల నిపుణులకు ఎంతగానో ప్రయోజనం కలుగుతుందన్నారు. అనిల్‌కుమార్ శుక్లా ఆర్గనైజర్‌గా వ్యవహరించనున్న ఈ ఎక్స్‌పోను పారిశ్రామిక వేత్తలతోపాటు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాడి రైతులకు రాయితీలు



నబొడ్డేపల్లిలో మందులు అందిస్తున్న ఏడీ నరేష్

కోటవురట్ల: పశు సంవర్ధక శాఖ అందిస్తున్న రాయితీలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టరు పెట్ల నరేష్ కోరారు. చినబొడ్డేపల్లిలో పశు ఆరోగ్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. పశు వైద్యాధికారి డాక్టరు హరిప్రియ పశువులకు చికిత్స అందించారు. ఏడీ నరేష్ మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న లింగ నిర్ధారణ వీర్యంతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. పశు ఆరోగ్య శిబిరాల ద్వారా పశువులు, మేకలు, గొర్రెల్లో ఉత్పాదక శక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాడి రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్సాహంగా స్కూల్ వార్షికోత్సవం

యలమంచిలి రూరల్: పట్టణంలోని సెయింట్ మేరీస్ స్కూల్ 38వ వార్షికోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల యాజమాన్యం, ఎంఈవో అరుణ్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు పరుగు పోటీల విజేత రామన్నపాలెం

కశింకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేటలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలో రామన్నపాలెంకు చెందిన గుర్రం విజేతగా నిలిచింది. ఇక్కడ వైఎస్సార్ తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పోటీలో భోగాపురం గుర్రానికి ద్వితీయ, కోటనందురు గుర్రానికి తృతీయ, యలమంచిలి గుర్రానికి చతుర్థి, రామన్నపాలెం మరో గుర్రానికి పంచమ స్థానాలు లభించాయి. ఈ పోటీలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ ప్రారంభించారు. విజయం సాధించిన గుర్రాల నిర్వాహకులకు నగదు బహుమతులు అందజేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ఉత్సాహంగా పోటీలకు ప్రజలు హాజరయ్యారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, ఉప సర్పంచ్ యర్రంశెట్టి శ్రీను తదితరులు హాజరయ్యారు. ఉదయం మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం వద్ద మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది.

దేవస్థానాల్లో ఉద్యోగం ఓ వరం



వరహాలరావు దంపతులకు అప్పన్న చిత్రపటాన్ని అందిస్తున్న దేవస్థానం ఈవో త్రినాథరావు

సింహాచలం: దేవస్థానాల్లో ఉద్యోగం చేయడం భగవంతుడు ఇచ్చిన వరంగా భావించాలని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహాచలం దేవస్థానంలో 39 ఏళ్లు విధులు నిర్వర్తించి, శుక్రవారం పదవీ విరమణ చేసిన సీనియర్ అసిస్టెంట్ ముగ్గు వరహాలరావు దంపతులను దేవస్థానం ఉద్యోగుల సంఘం ఘనంగా సత్కరించింది. సింహగిరిపై కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో ఈవో పాల్గొని వరహాలరావు దంపతులను దుశ్శాలువాతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో ఉద్యోగం కొందరినే వరిస్తుందని, భగవంతుడు ఇచ్చిన ఈ అవకాశాన్ని ఉద్యోగులు నిబద్ధతో నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఇన్‌చార్జి డీఈ హరి, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, నరసింగరావు, సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్, ఉద్యోగులు, వైదికులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కళాకారులను ప్రోత్సహించాలి



కోలాటం కళాకారులకు చిడతలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: ప్రతి ఒక్కరూ కళాకారులను ప్రోత్సహించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. గురువారం రాత్రి మునగపాకలో తన జన్మదినం సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీతో పాటు కోలాటం కళాకారులకు చిడతలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మునగపాక అంటేనే కళాకారులకు పెట్టింది పేరుగా గుర్తింపు ఉందన్నారు. నాటక రంగంతో పాటు కోలాటం కళాకారులు ఇక్కడ అధికంగానే ప్రదర్శనలు ఇస్తుంటారన్నారు. అటువంటి వారిని ప్రోత్సహించడం ద్వారా మునగపాక ఖ్యాతిని ఇతర ప్రాంతాలకు ఇనుమడింప చేసే అవకాశం ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, ఆడారి కాశీబాబు, పెంటకోట శ్రీనివాసరావు, ఆడారి రమణబాబు, మళ్ల కృష్ణ, మళ్ల జోగారావు పాల్గొన్నారు.

గౌరవప్రదమైనది ఉపాధ్యాయ వృత్తి



ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

కోటవురట్ల: పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి గౌరవాన్ని ఆపాదించిన వ్యక్తి ఉపాధ్యాయుడు బొండాడ మణి చంద్రశేఖర్ అని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు ప్రశంసించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు మణి చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమానికి శ్రీనివాసులనాయుడు హాజరై శాలువాతో సత్కరించారు. 30 ఏళ్ల విధి నిర్వహణలో గురువుగా ఎందరో విద్యార్థులకు ఉన్నత జీవితాలను అందించారన్నారన్నారు. విశ్రాంత జీవితాన్ని సంతోషంగా గడపాలని సహచర ఉపాధ్యాయులు ఆకాంక్షించగా, తమను ఆశీర్వదించాలని విద్యార్థులు ప్రణమిల్లారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.జి.నాథ్, హెచ్ఎం ఎం.లక్ష్మి, ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సర్వర్లు మొరాయించడంతో ఇక్కట్లు

యలమంచిలిలో రెండ్రోజుల్లో 165 రిజిస్ట్రేషన్లు

యలమంచిలి రూరల్: ఈ నెల ఒకటో తేదీ నుంచి భూములు, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతున్నట్టు గత నెల ప్రభుత్వం ప్రకటించడంతో ముందుగా రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి క్రయ, విక్రయదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రెండ్రోజులుగా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ సర్వర్లు మొరాయించడంతో కక్షిదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. గురు, శుక్రవారాల్లో 165 వరకు రిజిస్ట్రేషన్లు జరిగినట్టు తెలుస్తోంది. సర్వర్లు మొరాయించడంతో సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఆ తర్వాత త్వరగా ప్రక్రియ పూర్తి కావడంతో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గత నెల 27వ తేదీన భూముల విలువలు, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇదే విషయాన్ని కొద్దిరోజుల ముందుగా ప్రకటిస్తే ఇంత ఇబ్బంది పడేవారం కాదని పలువురు కక్షిదారులు వాపోయారు. మరోవైపు యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సరైన వసతులు లేక క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, మహిళలు బాగా ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు



రోటరీ ఫ్యామిలీ క్లబ్ సభ్యులను శాలువాలతో సత్కరించిన ఎస్ఎస్ వర్మ

అనకాపల్లి: ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు చేస్తూ జీవితాన్ని గడపాలని అనకాపల్లి ఇన్‌కమ్ ట్యాక్స్ ఆడిటర్ ఎస్.ఎస్.శర్మ తెలిపారు. శుక్రవారం స్థానిక న్యూకాలనీ పాలూరు రోటరీ కల్యాణ మండపంలో ఫ్యామిలీ ఆఫ్ రోటరీ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిపాటు రోటరీ క్లబ్ సభ్యులు బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పేదలకు ధనవంతులు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం గతేడాది ఉత్తమ సేవలు చేసిన రోటరీ ఫ్యామిలీ కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఫ్యామిలీ రోటరీ చైర్మన్ చిత్తంబరం, అధ్యక్షుడు సరిపల్లి రాజేష్, కార్యదర్శి అనిల్, సభ్యులు డాక్టర్ శేషు కుమార్, రఘురాం జోహార్, కే సతీష్, సాన త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.